

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,3 జనవరి 2026 | 8 పేజీలు


## సత్యదేవుని సాక్షిగా

# 'దాన' దోపిడీ బట్టబయలు

## సూర్య అస్త్రానికి కుప్పకూలిన అవినీతి సామ్రాజ్యం !



### మంత్రి నిమ్మల ఆవేదన..

"పేద ప్రజలకు ఆధ్యాత్మిక ఫలాలు అందించాలని నేను కోటి ఆశలతో 3,000 సామూహిక ఉచిత సత్యనారాయణ స్వామి వ్రతాలను ఏర్పాటు చేస్తే.. భక్తులను మోసం చేసి డబ్బులు గుంజుతారా? ఇది క్షమించరాని అపరాధం. నా ప్రజల క్షేమం కోసం నేను తలపెట్టిన యజ్ఞాన్ని, వీరు ధనయజ్ఞంగా మార్చడం అత్యంత బాధాకరం."



అక్రమాల వ్రత పురోహితులను సస్పెండ్ చేస్తూ తక్షణ చర్యలు

- మంత్రి నిమ్మల పాలకొల్లు వ్రతాల సంకల్పానికి... వ్రత కథకుడు గురుమూర్తి బృందం తూట్లు..
- వైరల్ వీడియోతో వణికిన దేవాదాయ శాఖ పరువు.. రంగంలోకి ప్రభుత్వ పెద్దలు
- మంత్రి నిమ్మల 'క్రిమినల్' వేట ప్రారంభం.. భక్తుల మనోభావాలతో చెలగాటమాడితే జైలుశిక్షే
- పాలకొల్లులో అక్రమ రూ.15లక్షల వసూళ్లపై ఉక్కుపాదం.. క్రిమినల్ కేసులకి రంగం సిద్ధం!
- కమీషనర్‌ను కలిసిన సస్పెండ్ అయిన పురోహితులు
- ఈ విషయంపై త్వరలో కోర్టుకు ధార్మిక సంఘాలు



వైరల్ వీడియో సాక్ష్యం

- మిగతా 2 లో..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో



అవినీతిపై మంత్రి నిమ్మల ఉక్కు పాదం!

### భక్తుల హెచ్చరిక..

"ఇటువంటి సంఘటనలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే.. వ్రత పురోహితులపై కేవలం విచారణలు, సస్పెన్షన్లు సరిపోవు. కఠినమైన క్రిమినల్ శిక్షలు పడాల్సిందే! దేవుడి సన్నిధిలో దోపిడీ చేసే ఇటువంటి ముఠాలను జైలుకు పంపినప్పుడే సామాన్య భక్తులకు వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది."



సూర్య
అన్నవరం 'వ్రత' దోపిడీపై
'సూర్య' అస్త్రం



సూర్య
వసూలైన రూ.15 లక్షలు ఏవి?..



సూర్య
స్వామివారి సాక్షిగా..
ఏసీబీ పంజా

# రైతుకు భరోసా

## పట్టాదార్ పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** రీసర్వే అనంతరం రాజముద్రతో ముద్రితమైన కొత్త పట్టాదారు పాసుపు స్తకాల పంపిణీ కార్యక్రమం రైతుల భూ హక్కులను మరింత భద్రపరిచే సమగ్రమైన సంస్కరణాత్మక అడుగని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అభివర్ణించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆత్రేయపురం సచివాలయం నందు రీసర్వే అనంతరం రాజముద్రతో ప్రచురితమైన పట్టాదార్ పాస్ పుస్తకాలు కార్యక్రమంలో ఆయన స్థానిక శాసనసభ్యులు సత్యానందరావు ముఖ్య అతిథులుగా పాల్గొని 921 పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి రైతు భూమి వివరాలు స్పష్టంగా, తప్పుల్లేకుండా, భవిష్యత్ తరాలకు కూడా విశ్వసనీయమైన రికార్డులుగా అందుబాటులో ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీసర్వే ద్వారా గ్రామాల వారీగా భూసర్వే, భూసరిహద్దుల పునఃస్థాపన, రికార్డుల సరిదిద్దడం పూర్తి చేసి, ఇప్పుడు అందిస్తున్న

- తరువాయి 2లో..

## రాజముద్రతో

# రైతుల హక్కుల పరిరక్షణ

### -రైతాంగ సమస్యలకు సంపూర్ణ సహకారం అందిస్తాం -మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి వారి హక్కులను పరిరక్షించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలు రూరల్ మండలం సురాపురంలో మంత్రి కందుల దుర్గేష్, ఏపీఎస్ఎస్ డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావులు 166 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్త పట్టదారు పాస్ పుస్తకాన్ని వేదికపై నిలబడి రైతాంగానికి చూపించారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి (జనవరి 2 నుండి) వారం రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా నిడదవోలు మండలంలో 6900కు పైగా, ఉండ్రాజవరం మండలంలో 3వేల పైచిలుకు, పెరవలి మండలంలో 2000కు పైగా మొత్తంగా నిడదవోలు నియోజకవర్గం వ్యాప్తంగా రీసర్వే చేసి 13,477 పట్టాదారు పాస్ పుస్తకాలు క్రమపద్ధతిలో రైతులకు అందిస్తామన్నారు. ప్రజల మధ్య ఉండి రెవెన్యూ సమస్యలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వామిత్వ, గ్రామసభలు తదితర

- తరువాయి 2లో..

# సత్యదేవుని సాక్షిగా 'దాన' దోపిడీ బట్టబయలు
# సూర్య అస్త్రానికి కుప్పకూలిన అవినీతి సామ్రాజ్యం!




**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** సాక్షాత్తు ఆ సత్యదేవుని ప్రతాన్ని వ్యాపారంగా మార్చి, అమాయక భక్తుల భయాన్ని ఆసరాగా చేసుకుని సుమారు రూ.15 లక్షలు దిగమింగిన అన్నవరం పురోహితుల బాగోతాన్ని 'సూర్య' దినపత్రిక ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. పాలకొల్లు నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం, వేల రూపాయలు ఖర్చు చేసి అన్నవరం వెళ్లలేని పేదల కోసం మంత్రి నిమ్మల రామానాయుడు అత్యంత భక్తితో తలపెట్టిన 3000 సామూహిక వ్రతాల వేదికపై, మైకు పట్టుకుని మరీ భక్తులను బెదిరించి కథకుడు గురుమూర్తి వసూళ్లకు పాల్పడిన తీరు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

రాష్ట్రాన్ని కుదిపేసిన వైరల్ వీడియో..

ఆధ్యాత్మిక ముసుగులో సాగుతున్న ఈ దోపిడీని 'సూర్య' వీధిన పెట్టింది. వ్రతం ముగింపులో కథకుడు మల్లాది గురుమూర్తి మైకులో.. "దబ్బులు ఇవ్వకపోతే వ్రత ఫలితం దక్కదు.. నవగ్రహ శాంతి జరగదు" అంటూ భక్తులను భయపెట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో దావాగ్నిలా వ్యాపించాయి. భక్తి ఉండాల్సిన చోట భయం పెట్టి, అందినకాడికి దండుకున్న ఈ 'దాన' దందాపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

మంత్రి నిమ్మల 'క్రిమినల్' వేట!

నిజాయితీకి నిలువుటద్దం వంటి మంత్రి నిమ్మల రామానాయుడు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం శాఖాపరమైన చర్యలతో సరిపెట్టకుండా, భక్తుల నమ్మకాన్ని వంచించిన మల్లాది గురుమూర్తి బృందంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అనుచరులు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

సంచలన నిర్ణయాలు – భక్తుల విజయం!

'సూర్య' కథనం ప్రభుత్వ పెద్దలకు చేరడం వారి ఆదేశాలతో దేవాదాయ శాఖ కమిషనర్ల దృష్టికి వెళ్లడంతో మెరుపు వేగంతో చర్యలు ప్రారంభమయ్యాయి :

– తక్షణ సస్పెన్షన్ : మల్లాది గురుమూర్తి సహా ఆరుగురు పురోహితులను వెంటనే విధుల్లోంచి తొలగించారు.

– శాశ్వత బహిష్కరణ : గతంలోనూ ఇలాంటి వసూళ్ల పర్వంలో అనేక మార్లు సస్పెన్షన్ ఆరోపణలున్న గురుమూర్తిని శాశ్వతంగా దేవాలయ సేవల నుండి దూరం చేసేందుకు ప్రక్రియ మొదలైంది.

– రికవరీ : భక్తుల నుంచి వసూలు చేసిన రూ.15 లక్షలను రికవరీ చేసేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పురోహితులపై దేవాదాయ శాఖ కమిషనర్ తీవ్ర ఆగ్రహం

సంచలన వీడియో లీక్‌తో దానాల పేరుతో భక్తులనుంచి లక్షల్లో దోచుకున్నారని స్పష్టంగా నిర్ధారణ కావడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో సస్పెన్షన్‌కు గురైన వ్రత పురోహితులపై దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ నిప్పులు చెరిగారు. కథకుడు గురుమూర్తి ఆధ్వర్యంలో, ఒక మంత్రి సిఫారసుతో సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ కమిషనర్‌ను కలిసిన పురోహితులకు తీవ్ర అవమానం ఎదురైంది.

వేల మంది భక్తుల మధ్య స్టేజ్‌పై నిలబడి, నవగ్రహాల శాంతి పేరుతో దానాలు అడగడం నిస్సిగ్గు చర్య అని, దీనివల్ల ప్రభుత్వానికి తీవ్ర స్థాయిలో చెడ్డపేరు వచ్చిందని కమిషనర్ మండిపడ్డారు. "అన్ని లక్షల రూపాయలు ఎక్కడ దాచారు? ఇదేనా మీ పద్ధతి?" అంటూ వారిని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. క్రమశిక్షణ విషయంలో రాజీ పడేది లేదని, భక్తుల నమ్మకాన్ని వమ్ము చేస్తే సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు.

కోర్టును ఆశ్రయించనున్న హిందూ సంఘాలు :

ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని క్షమించరాని తప్పుచేసిన పురోహితులపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేస్తే భక్తులు తరపున కోర్టును ఆశ్రయిస్తామని హిందూ సంఘాలు తెలిపాయి.

సామాన్యుడి గొంతుకగా నిలిచిన 'సూర్య' పత్రికకు, ప్రజల పక్షాన నిలిచిన మంత్రి నిమ్మల రామానాయుడుకి భక్తులు నీరాజనాలు అర్పిస్తున్నారు. దేవాలయాల పవిత్రతను కాపాడటంలో ప్రభుత్వం చూపిన ఈ వేగం ఆధ్యాత్మిక రంగంలో ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది.

# రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం కాకినాడ పట్టణ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం నియోజకవర్గాలలోని రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జేసీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రైతులతో కలిసి నూతన సంవత్సర వేడుక కేకును కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఈ నెల 2వ తేదీ నుంచి 09 వరకు గ్రామ సభలు నిర్వహించి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసి, ప్రభుత్వ రాజముద్రతో, అత్యాధునిక టెక్నాలజీతో ఈ నూతన పాస్ పుస్తకాలు రూపొందించారన్నారు. కాకినాడ, పెద్దాపురం రెండు డివిజన్లకు కలిపి మొత్తం 1, 35,372 నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ.. సమస్యలు లేని రెవెన్యూ వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు వారి భూమిపై హక్కు కల్పిస్తూ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టిందన్నారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే ఇతర కార్యక్రమాలు రైతులను ఎంతగానో ఆందోళనకు గురి చేసాయన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిందని, వాటిని సరిచేస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రభుత్వ రాజముద్రతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులు అందిస్తోందన్నారు. ఈ పుస్తకాల ద్వారా ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా క్యూఆర్ కోడ్‌తో రైతులకు అందించడం మంచి పరిణామమని ఆమె తెలిపారు.కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ డూప్లికేట్ పుస్తకాలకు తావులేకుండా పారదర్శకంగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు తయారుచేయడం జరిగిందన్నారు. రైతుల భూములకు భద్రత కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భవిష్యత్తులో కూడా సరిగా లేనివి సరిచేసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన తెలిపారు.కాకినాడ అర్బన్ శాసనసభ్యులు వనమాడి వేంకటేశ్వరరావు.. రైతులు పక్షాన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసారు. రైతులకు వారి భూములపై యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతులు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. గత ప్రభుత్వం ప్రతి కార్యక్రమంలో ప్రజా ప్రయోజనాలు కాక, తమ పార్టీల నాయకులు ఫోటోలు వేసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమాజంలో ఆదర్శంగా నిలిచిన, స్ఫూర్తినిచిన వ్యక్తులకు గుర్తింపునిస్తూ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ వంటి ఆదర్శమూర్తులు పేర్లు పెట్టి మంచి ఒరవడికి నాంది పలికిందన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఫోటోలు, పెయింటింగ్‌లకు, సరిహద్దు రాళ్ళకు వృధాగా సొమ్ము ఖర్చు చేసి, భారీ మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని అందించాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు.

# రైతుకు భరోసా

మొదటిపేజీ తరువాయి

కొత్త పాసు పుస్తకాలు ప్రత్యక్ష వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా తప్పుల్లేకుండా ముద్రించబడ్డాయన్నారు. ప్రతి పాసు పుస్తకంలో క్యూఆర్ కోడ్ కల్పించడం ద్వారా రైతు భూమి వివరాలు ఆన్‌లైన్ లో తక్షణమే ధృవీకరించుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. రైతులు తప్పకుండా తమ గ్రామ సభకు హాజరై, తమ పేర్లు, సర్వే నంబర్లు, ఎక్స్ టెంట్ మొదలైన వివరాలలో ఎక్కడైనా చిన్నపాటి పొరపాట్లు, పేరు స్పెల్లింగ్, ఫోటో, ఇతర వివరాల్లో లోపాలు కనిపించినట్లయితే, వారికి ఎలాంటి రుసుము లేకుండా సవరణలు చేయించి సరిచేసిన పాసుపుస్తకాలు అందించేలా రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశాలు అందాయన్నారు.

స్థానిక శాసనస భ్యులు బి.సత్యానందరావు ప్రసంగిస్తూ రైతు రుణాల మంజూరుకు ప్రధాన ఆధారం లైవ్ వెబ్ ల్యాండ్‌లోని రికార్డులేనని, పాసుపుస్తకం లేని పక్షంలో రైతుకీ పంట రుణాలు నిలిచిపోతాయని ముందుగానే రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందాలన్నారు. ఈ పాసు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, అన్ని సౌలభ్యాల ను పొందుతూ ఉత్పాదక తను పెంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, వాడపల్లి ఛైర్మన్ ముదునూరి వెంకట రాజు, ఆత్రేయపురం గ్రామ సర్పంచ్ గెడ్డం సుదా, తహశీల్దార్ ఆర్.డి.రామచంద్రమూర్తి, ఎంపీడీవో వెంకట రామన్, ఆకుల రామకృష్ణ, మండల టి.డి.పి. అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణం రాజు, వెచ్చ అనిల్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజముద్రతో రైతుల హక్కుల పరిరక్షణ

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వల్ల రైతన్నలకు తమ భూములపై పూర్తి హక్కులు వస్తాయన్నారు. పాస్ బుక్ లో పొలానికి సంబంధించిన సర్వే నంబర్లు, సరిహద్దులు, విస్తీర్ణం సరిగా ఉన్నాయో లేదో రైతులు గమనించాలని సూచించారు. ఎవరికైనా తమ పాస్ పుస్తకంలో హెచ్చు తగ్గులు, లోపాలేమైనా ఉంటే సత్వరమే అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు సైతం త్వరితగతిన పరిష్కారం చూపించాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆదేశించారు. అలా జరగని పక్షంలో రైతులకు అండగా నిలబడి న్యాయం చేసేందుకు తాముంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మన నాన్న, తాతలు సంపాదించిన ఆస్తిపై ఎవరి ఫోటోలు ఉంటే ఎలా అని అది మన కర్మ అని మండిపడ్డారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో అధికారికంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తోందన్నారు. తద్వారా ప్రభుత్వ అనుమతికి నిదర్శనంగా పాస్ పుస్తకాలు ఉండనున్నాయన్నారు. సంబంధిత భూమిలో ఏదైనా కార్యక్రమం చేసుకోవాలన్నా, అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలన్నా, లోన్ పొందాలనుకున్నా పట్టాదారు పాస్ పుస్తకం అనేది రైతుకు తప్పనిసరి అన్నారు. ఇదొక రాజపత్రం అని పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ నిర్వాసితులకు ఖాతాదారులలో అయోమయం

**కూనవరం, మేజర్ న్యూస్ :** పోలవరం నిర్వాసిత గ్రామమైన కూనవరం గ్రామానికి చెందిన నిర్వాసితులకు స్ట్రక్చర్ వేల్యూ ను ప్రభుత్వం ఆయా ఖాతాల్లోకి జమ చేసింది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఖాతాదారులకు స్ట్రక్చర్ వేల్యూ జమ కాకపోవటంతో ఖాతాదారులు అయోమయంలో ఉన్నారు. గత నెల రోజుల క్రితం కొన్ని గ్రామీణ బ్యాంకుల విలీనం కావడంతో ఐఎఫ్‌ఎస్సి కోడ్ మారటంతో ఖాతాదారులకు నగదు జమ కావడం లేదు. కూనవరం గ్రామానికి చెందిన నిర్వాసితులు ఇటీవల చిత్తూర్ ఐటిడిఏ కార్యాలయానికి వెళ్ళి తమ గోడును అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది.

టిడిపి మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్ రావు నాయకత్వంలో ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. సమస్యపై స్పందించిన అధికారులు బ్యాంకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. అయినా నగదు జమ కాకపోవటంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికైనా బ్యాంక్ అధికారులు చొరవ తీసుకొని ఖాతాదారులకు నగదు పంపిణీ చేయవలసిందిగా ఈ ప్రాంతం నిర్వాసితులు కోరుతున్నారు.

# ఖాకీ చొక్కాలో కమ్మని మమకారం



– వృద్ధులతో సీఐ సునీల్ కుమార్ నూతన సంవత్సర వేడుకలు!

**కాకినాడ, మేజర్ న్యూస్ క్రైమ్ :** చట్టాన్ని అమలు చేయడంలో కఠినత్వం.. సమాజానికి భరోసా ఇవ్వడంలో కోమలత్వం.. ఈ రెండింటి కలయికే కాకినాడ పోర్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్. సాధారణంగా పోలీసులు అంటే లాఠీలు, కేసులు, కట్టుదిట్టమైన భద్రత మాత్రమే గుర్తొస్తాయి. కానీ, నూతన సంవత్సరం 2026 వేళ ఆయన తనలోని మానవీయ కోణాన్ని ఆవిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**అవ్వల నవ్వుల్లో కొత్త వెలుగులు :**

నూతన సంవత్సర సంబరాలను ఆర్భాటాలకు లోనుకాకుండా, ఆదరణ కరువైన మాతృమూర్తుల మధ్య నిర్వహించి సీఐ సునీల్ కుమార్ బృందం ఆదర్శంగా నిలిచింది. స్వయంగా అమ్మల దగ్గరకు వెళ్లి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, "నేనున్నాను" అనే భరోసా కల్పించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేయడమే కాకుండా, వారి ఆశీస్సులు తీసుకోవడం అక్కడి వారిని భావోద్వేగానికి గురిచేసింది.

**శాంతి భద్రతలే కాదు.. సామాజిక బాధ్యత కూడా :**

దొంగల పట్ల సింహంలా గర్జించే ఖాకీ విభాగం, వృద్ధుల పట్ల మనవడిలా మారి చేసిన ఈ సేవ ప్రతి ఒక్కరి మనసు గెలుచుకుంది. "సమాజంలో స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, వృద్ధులకు రక్షణగా నిలవడమే మా లక్ష్యం" అని సీఐ సునీల్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారులు మరియు యువత కూడా ఇదే స్ఫూర్తితో వృద్ధులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.కాకినాడ పోర్టు పోలీసుల ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసులంటే భయం కాదు, భరోసా అని మరోసారి నిరూపించారు సునీల్ కుమార్ అండ్ టీం.

# కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు

- ఆత్రేయపురం కుమ్మరిగూడేనికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు ప్రజలకు మేలు జరుగుతుందని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళులా సాగుతున్న కూటమిపాలన వైపు ప్రజలంతా ఆకర్షితులవుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు ఆయన. వాడపల్లి దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు నేతృత్వంలో ఆత్రేయపురం కుమ్మరి గూడెనికి చెందిన 50 శాలివాహన కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి ఎమ్మెల్యే బండారు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. తెలుగుదేశం కుటుంబంలోకి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,ముళ్ళపూడి భాస్కరరావు, కుసంపూడి రామకృష్ణరాజు, జుజ్జవరపు హరిబాబు, నరాల శెట్టి వెంకన్న, ముదునూరి సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పురుషోత్తపట్నం గ్రామంలో ఘనంగా భద్రాద్రి రామయ్యకు రాపత్తు సేవ





**ఎటపాక, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పోలవరం జిల్లా, ఎటపాక మండలం, పురుషోత్తపట్నం గ్రామంలో సీతారామచంద్ర స్వామివారిని మంగళ వాయిద్యాలతో, కోలాటాల బృందంతో రంగవల్లికల మధ్య స్వామివారిని గొప్ప ఊరేగింపుగా తీసుకువచ్చి పురుషోత్తపట్నం గ్రామంలోని రామాలయంలో ఘనంగా రాపత్తు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నపిల్లలచే కూచిపూడి, కథాకేళి, భరతనాట్యం, కోలాటం నిర్వహించడం జరిగింది. భక్తులు గ్రామస్తులు అందరూ కలిసి 200 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రాపత్తు సేవను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుందూరు రామిరెడ్డి, అర్రిమల్ల రామచంద్రరావు, ఆకుల శ్రీనివాస్, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, విజ్జిగిరి రవితేజ, పుట్టి శ్రీనివాస్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుద్దుకూరు శ్రీనివాసరావు, సారెడ్డి ఏడుకొండలు రెడ్డి, అన్నెం జై చంద్ర రెడ్డి, పుట్టి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంధ విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు..



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 4న ప్రపంచ బ్రెయిలీ డే సందర్భంగా 217వ లూయిస్ బ్రెయిలీ జన్మ దిన వేడుకలు పురస్కరించుకొని అంధ విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ ఎన్ఎఫ్సీఎల్ రోడ్, కాకినాడ నందు ఉదయం 10.00 గంటల నుండి నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ ఎస్పి సత్యనారాయణ, కాకినాడ మునిసిపల్ కమీషనర్ సత్యనారాయణ, జిల్లా ఖజానా శాఖాధికారి గణేష్, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎ.వి.శ్రీనివాస్, ఈగల్ టీం, వివిధ అంధ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, సుమారు 150 మంది అంధ విద్యార్థిని విద్యార్థులు, సుమారు 50 మంది అంధ ఉద్యోగులు కాకినాడ, తూర్పు గోదావరి మరియు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుండి పాల్గొనడం జరిగింది. రన్నింగ్ 100, 50 మీటర్స్, టగ్ ఆఫ్ వార్, చెస్, క్రికెట్ పోటీలలో గెలుపొంది నవారికి 04.01.2026న లూయి బ్రెయిలీ జన్మదినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అతిథులచే అందజేయడం జరుగుతుంది.

# రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో...

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ప్రారంభం




**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ డిపో గ్యారేజ్ నందు శుక్రవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 1 నుండి జనవరి 31 వరకు నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా, డిపో మేనేజర్ పేపకాయల భాస్కర రావు అధ్యక్షతన ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రెడ్డి రాజేంద్ర ప్రసాద్ హాజరై, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అమూల్యమైన సూచనలు అందించారు.సమావేశంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ.. గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాల శాతం 0.05 మేర తగ్గడం మంచి పరిణామమని, డ్రైవర్లు శిక్షణతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని కోరారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు ఎదుటి వ్యక్తి కదలికలను ముందే గుర్తించి అప్రమత్తంగా ఉండాలని, మానవ తప్పిదాల వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకూడదని ఆయన హితవు పలికారు. వాహనం యొక్క కండిషన్‌ను నిరంతరం గమనిస్తూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. రవికుమార్, అసిస్టెంట్ మెకానిక్ ఫోర్ మెన్ జి.రవిబాబు, గ్యారేజ్ మరియు కార్యాలయ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడమే ధ్యేయం







**– డ్రాగన్ పడవ పోటీలకు సంబంధించి కయాకింగ్ కార్యక్రమం నిర్వహణ**

**– పాల్గొన్న జిల్లా కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యే సత్యానందరావు, ఎస్పీ రాహుల్**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం పరిసర ప్రాంతాల ను టూరిజం హబ్‌గా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాలు అన్నారు. జనవరి 11,12,13 తేదీల్లో జరిగే డ్రాగన్ పడవల పోటీలకు సంబంధించి ఆత్రేయపురం మండలం తాడిపూడి వంతెన వద్ద శుక్రవారం జరిగిన కయాకింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో పి శ్రీకర్, ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు లతో కల్సి పాల్గొన్నారు. పులిదిండి నుంచి తాడిపూడి వంతెన వరకు పడవ మీద ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీలకు వన్నె తెచ్చే విధంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ స్వయంగా కయాకింగ్ కార్యక్రమంలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు కురిపించారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని పులిదిండి గ్రామంలో కయాకింగ్ డ్రాగన్ బోటింగును జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, శాసనసభ్యులు లాంఛనం గా ప్రారంభించారు. అనంతరం మూడు రోజుల పాటు నిర్వ హించనున్న పోటీల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లను వారు పరిశీలించారు. గత సంవత్సరం జరిగిన పోటీలు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరును తీసుకువచ్చాయన్నారు. ఈ సంవత్సరం ఈ పోటీలను మరింత రెట్టింపు ఉత్సాహంతో మరింత బాగా నిర్వహించడానికి సన్నద్ధమయ్యామన్నారు. కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డిఓ పి శ్రీకర్, టూరిజం అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు ఇందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల వరకూ రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మెయిన్ కెనాల్ ఇక్కడ ఉండడం మన అదృష్టమన్నారు. ఈ కెనాల్‌లో వాటర్ స్పోర్ట్స్‌ని, డ్రాగన్ పడవల పోటీలను ఏర్పాటు చేసి భవిష్యత్తులో పెద్ద టూరిజం హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాలన్నీ తప్పక ఫలిస్తాయని తెలిపారు. అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర పండుగగా ఈ యొక్క ఉత్సవ పోటీలను మూడు రోజులపాటు పకడ్బందీ రక్షణ భద్రత ఏర్పాట్ల మధ్య విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదే శించారు. గత ఏడాది కన్నా ఈ ప్రాంత విశిష్టత కు వన్నె తెచ్చే విధంగా రెట్టింపు ఉత్సాహంతో ఈ ఏడాది నిర్వహించాలని స్థానిక శాస నసభ్యులు బండారు సత్యా నంద రావు అన్నారు.

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా ప్రసంగిస్తూ అఖండ గోదావరి తీర ప్రాంత సాంస్కృతి సాంప్రదా యాలను ప్రతిబింబించేలా హిందువుల అతిపెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించు కొని ఈ ఉత్సవాలు నిర్వహించడం సంతోషదాయ కమన్నారు. ఈ పోటీల నిర్వహణలో స్థానిక శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ వా రు తీసుకున్న చొరవను ఎస్పీ అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో పీ.శ్రీకర్ డిఎస్పి మురళీమోహన్, జిల్లా పర్యాటక అధికారి అన్వర్, తాసిల్దారు రామచంద్రమూర్తి, కూటమి నాయకులు వెచ్చ అనిల్, ముల్లపూడి భాస్క రరావు, పి.ఎస్.రాజు, జుజవరపు హరిబాబు, తోటకూర సుబ్బరాజు, నరాల శెట్టి వెంకన్న, తోట రజిని, మండల స్థాయి అధికారులు, బోటు ఫెస్టివల్ కమిటీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం గోదావరి తీరాన ఉత్కంఠ..
# కలెక్టర్ మహేష్ కుమార్‌కు త్రుటిలో తప్పిన ముప్పు!



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** అది ఆత్రేయపురం గోదావరి గట్టు.. రాష్ట్రస్థాయి కయాకింగ్ పోటీల సందడితో కళకళలాడుతోంది. కానీ ఒక్కసారిగా అక్కడ నిశ్శబ్దం అలుముకుంది. సర్దార్ కాటన్ ట్రోఫీ ట్రైల్ రన్‌లో భాగంగా జరిగిన ఒక అనూహ్య ఘటన జిల్లా యంత్రాంగాన్ని, ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది.

**అసలేం జరిగింది?** ఈ నెల 11,12,13 తేదీలలో జరగనున్న ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి కయాకింగ్ పడవ పోటీల కోసం శుక్రవారం డ్రాగన్ పోటీల ట్రైల్ రన్ నిర్వహించారు. సాహసానికి మారుపేరైన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ స్వయంగా పడవపై వెళ్లి పరిశీలిస్తుండగా, ఊహించని విధంగా పడవ ఒక్కసారిగా నదిలో బోల్తా పడింది.

**క్షణాల్లో స్పందించిన గజ ఈతగాళ్లు**

కలెక్టర్ నీట మునిగిన దృశ్యం చూడగానే అక్కడున్న వారంతా ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అయితే, అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు మెరుపు వేగంతో స్పందించారు. ప్రాణాలకు తెగించి నీటిలోకి దూకి, కలెక్టర్‌ని సురక్షితంగా రక్షించి మరో పడవలో ఒడ్డుకు చేర్చారు.

**ప్రజల గుండె చప్పుడు.. దేశవ్యాప్త చర్చ!**

ఈవార్తతెలియగానే ఆత్రేయపురం ప్రజలు ఒక్కసారిగా తల్లడిల్లిపో యారు. తమ కోసం నిరంతరం శ్రమించే కలెక్టర్‌కి ఏమీ కాకూడదని ప్రార్థనలు చేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో ట్రెండింగ్‌గా మారింది.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎస్పీ రాహుల్ మీనా మరియు ఇతర అధికారులు కలెక్టర్ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. "ప్రజల కలెక్టర్ క్షేమంగా ఉన్నారు" అంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు.

## స్వల్ప ఘటనపై దుష్ప్రచారాలు వద్దు




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురంలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో జరగనున్న డ్రాగన్ పడవల పోటీలకు సంబంధించి కయాకింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రమాదానికి గురైనట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డ్రాగన్ పడవల పోటీలను ప్రచారం చేయాలన్న సంకల్పంతో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డిఓ పి.శ్రీకర్, డీఎస్పీ మురళీమోహన్, తాను కలిసి పులిదిండి నుంచి తాడిపూడి వంతెన వరకు ప్రమోషన్‌గా పడవ ప్రయాణం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ గతంలో కయాకింగ్‌లో శిక్షణ పొంది ఉండడం చేత స్వయంగా ఆయన పడవను నడిపారని తెలిపారు. ఈ సమయంలో ఆయన పడవ నుంచి స్కిడ్ కావడం మరలా తనకు తానుగానే పడవను అధిరోహించి నడపడం జరిగిందన్నారు. ఇదంతా కయాకింగ్‌లో సహజమన్నారు. డ్రాగన్ పడవల పోటీల ప్రచారంలో భాగంగా ఆయన ఎంతో ఉత్సాహంగా ప్రజలను ఉత్తేజపరిచేందుకు ఈ కయాకింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారని, ఆ తర్వాత రెవెన్యూ సదస్సు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకున్నారని కనుక ఈ అంశంపై దుష్ప్రచారాలు వద్దని ఎమ్మెల్యే మనవి చేశారు.

## శ్రీ వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చండీ హెూమం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో, క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వన దుర్గమ్మ అమ్మవారిని వివిధ రకములపుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు, అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించిన భక్తులకు, వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా, ఆలయ అర్చకులు, తీర్థ, ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:**కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు శుక్రవారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన లుక్కా అశోక్, సంధ్య రాణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# కొత్తపేటలో 'కాత్యాయనీ' దేవి అవినీతి విశ్వరూపం

- ఎక్సైజ్ 'సర్కిల్'లో కాసుల వేట..
  బాటిల్ బాటిల్‌కు 'అదనపు' బాదుడు!
- కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని
  అన్ని మండలాల్లో ఎమ్మార్పీకి మించి అమ్మకాలు
- గగ్గోలు గగ్గోలు పెడుతున్న మందుబాబులు
- 'అమ్మ'వారి ఆశీస్సులతోనే బెల్ట్ షాపుల దందా?
  కొత్తపేటలో మద్యం మాఫియా అరాచకం.
- కూటమి లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్న అధికారులు..
  సూర్య బ్యూరో ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్.

## ఎక్సైజ్ శాఖలో ముడుపుల నైవేద్యం!










**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కోనసీమ మద్యం మార్కెట్ ఇప్పుడు అక్రమార్కులకు కామధేనువుగా మారింది. ముఖ్యంగా కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఒక ఉన్నతాధికారి పేరు వింటేనే అక్రమ మద్యం వ్యాపారులకు పూనకం వస్తోంది. పేరులో 'కాత్యాయని' (దుర్గాదేవి అంశ) ఉన్నప్పటికీ, ఆమె పాలనలో మాత్రం సామాన్యమందుబాబులకు నరకం కనిపిస్తోంది. ఆత్రేయ పురం, రావులపాలెం, పి.గన్నవరం మండలాల్లో ఎమ్మార్పీకి మించి అమ్మకాలతో మద్యం మాఫియా బరితెగించి సాగిస్తున్న దందా వెనుక సదరు అధికారిణి "కృపాకటాక్షాలు" పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎమ్మార్పీ మించి అధర్మపు వసూళ్లు.. అడ్డగోలు దోపిడీ!**

కూటమి ప్రభుత్వం ఎంఆర్పీ (MRP) ఉల్లంఘనలను సహించేది లేదని కరాఖండిగా చెప్పినప్పటికీ, కొత్తపేట సర్కిల్ పరిధిలోని మండలాల్లో మాత్రం నిబంధనలు 'అమ్మవారి' పాదాల చెంత బందీ అయ్యాయట... అధికారిక షాపుల్లో ప్రతి క్వార్టర్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక ఈ సర్కిల్ పరిధిలోని ప్రతీ మండలంలో ఉన్న వందలాది బెల్ట్ షాపుల్లో ఒక్కో సీసాపై రూ.30 నుండి రూ.50 వరకు బాదుతున్నారు. ఈ దోపిడీలో సింహభాగం సదరు సీఐ గారికి నెలవారీ మామూళ్ల రూపంలో చేరుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**షాపుకో రేటు.. సీఐకి 'కోటా'!**

**ఎమ్మార్పీ మించి విక్రయాలకు...**

కొత్తపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రతి మద్యం షాపు యజమాని నెలకు రూ.62,000 చొప్పున సీఐకి సమర్పించుకోవాల్సిందేనని వ్యాపారులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇక బెల్ట్ షాపుల నిర్వహణకు ఒక్కో షాపు నుంచి రూ.10,000 వసూలు చేస్తున్నారట. ఇవి కాకుండా గోవా, బెంగళూరు నుంచి వచ్చే నాన్-డ్యూటీ పెయిడ్ (చీఫ్) మద్యం అమ్మకాలకు కొన్ని షాపులకే సహకరిస్తున్నందుకు లక్షల్లో అదనపు ముడుపులు అందుతున్నట్లు సమాచారం.

**ప్రజల ప్రాణాలతో 'కింగ్స్' చెలగాటం!**

ఇక్కడ 'కింగ్' అనే పేరుతో చలామణి అవుతున్న ఒక మాఫియా ముఠా రాష్ట్ర స్థాయి అధికారుల అండతో అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తోందని విశ్వసనీయ సమాచారం. నాణ్యత లేని, ఇతర రాష్ట్రాల మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తూ మందుబాబుల ఆరోగ్యాలను గుల్ల చేస్తున్నారట ఈ మాఫియా. మండల కేంద్రాల్లోనే షాపులన్నీ కేంద్రీకృతం చేసి, గ్రామాల్లో కావాలనే బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు.

**బంధనల ఉల్లంఘన.. రాత్రంతా విక్రయాలే!**

ఉదయం 6 గంటలకే మందు దుకాణాలు తెరుచుకుంటున్నాయి. రాత్రి వేళల్లో షట్టర్లు మూసినా, వెనుక వైపు దొడ్డిదారిలో అమ్మకాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. సీసీ కెమెరాలు లేవు, రసీదులు అసలే లేవు. అన్ని దారులు ఎమ్మార్పీ ఉల్లంఘనలే. పగలు ఒక రేటు రాత్రి ఒక రేటు .. అంతా ఆ అధికారిణి కనుసన్నల్లోనే సాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ పే ద్వారా అదనపు వసూళ్లు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఎమ్మార్పీకి మించి అమ్ముతున్నారని ఎంత మొరపెట్టుకుంటున్న సామాన్యుడు గోడు వినే అధికారే లేదని మందు బాబు ఆవేదన చెందుతున్నారు.

**ప్రభుత్వానికి సవాల్‌గా మారిన కొత్తపేట అక్రమాలు!**

గత ప్రభుత్వ పాలనలో మద్యం అక్రమాలకు విసిగిపోయిన ప్రజలు, కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఓటేశారు. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న ఇలాంటి అవినీతి అధికారులు ప్రభుత్వప్రతిష్టను గంగలో కలుపుతున్నారు. మహిళల స్వేచ్ఛకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఈ 'అమ్మవారి' అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి, కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్‌పై ప్రత్యేక నిఘా పెట్టి, అవినీతి తిమింగలాలను వేటాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






## అక్రమ మైనింగ్‌లతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా?



**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ మైనింగ్‌లతో ఇబ్బందులు పడుతున్నా ప్రజలకు న్యాయం జరగడం లేదని లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే పిజిఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించామంటూ మైనింగ్ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇక పిజిఆర్ఎస్ తో ఉపయోగమేమిటని ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు ప్రశ్నించారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజక వర్గంలో వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న మైనింగ్ క్వారీలు వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న క్వారీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, పర్యావరణ కాలుష్యం, ప్రజల ఆస్తులు నష్టపోవడం, ఇళ్ళు పగిలిపోవడం, వ్యవసాయ పొలాలు, రహదారులు నాశనం అవడం వంటి సమస్యలపై ఐటిడిఏ, జిల్లా కలెక్టర్ పిజిఆర్ఎస్ లో ఎన్నోసార్లు దరఖాస్తులు చేసుకున్నా సంబంధిత మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే దరఖాస్తులు మూసివేసి ఎటువంటి పరిష్కారం చేయకుండానే పరిష్కరించామంటూ తప్పుడు నివేదికలు పంపుతున్నారని ఆయన మండిపడ్డారు. గంగవరం మండలం ఓజుబందలో కొనసాగుతున్న నల్లరాయి క్వారీల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై ప్రజలందరూ ఏకాభిప్రాయంతో గ్రామసభ నిర్వహించి క్వారీలను వ్యతిరేకిస్తూ ఐటిడిఏ కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయగా ఇప్పటివరకు క్షేత్రస్థాయి విచారణ జరపకుండా మైనింగ్ అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆయన అన్నారు. రంపచోడవరం మండలం నరసాపురం లోని నల్లరాయి క్వారీల వలన నర్సాపురం, దిరిసినపల్లి గ్రామాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గత 9 నెలలుగా ప్రజలు పోరాటం చేస్తున్న మైనింగ్ అధికారులు సమస్యను తప్పుదోవ పట్టిస్తూ ఉన్నత అధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆయన మండి పడ్డారు. క్వారీ బాధితులకు అండగా నిలుస్తున్నందుకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులపై క్వారీ నిర్వహణదారులు మైనింగ్ అధికారులు ఆదివాసీ ప్రజలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని, వీటిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసులకు యమపాశలుగా మారిన నల్లరాయి క్వారీల పై చర్యలు తీసుకునేదాకా, ప్రజలకు న్యాయం చేసే దాకా ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటం చేస్తూనే ఉంటుందని ఆయన తెలియజేశారు. మైనింగ్ సమస్యలు పరిష్కారం కోసం ప్రజలకు న్యాయం జరగటం కోసం త్వరలోనే రంపచోడవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన చేయబోతున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఈ నెల 5న విబి-జీ రామ్ జీపై ప్రత్యేక గ్రామ సభలు

**- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి ఎన్.ఆర్. ఇ.జి.ఎ) స్థానంలో విక సిత భారత్ 2047 దార్శ నికతకు అనుగుణంగా వికసిత భారత్ - రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ) (విబి-జీ రామ్ జీ) చట్టంపై ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని, ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రతీ గ్రామ పంచాయతీలలో ఈ గ్రామ సభలలో విబి-జీ రామ్ జీ కొత్త చట్టంలోని ముఖ్యాంశాలను వివరించి, విస్తృత అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టం గ్రామీణ కుటుంబాల కోసం తీసుకువచ్చిన చట్టం అని దీని ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచారని, కావున ఈ గ్రామ సభలలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఉపాధి శ్రామికులు, మేట్లు, మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలందరు పాల్గొనేట్లు ఉపాధి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది చూడాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిఓ దేగల సుధీర్, జెఇ సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విష్ణు దంతవైద్య కళాశాల వారి సేవలు అమోఘం



**పెరవలి, మేజర్ న్యూస్ :** విష్ణు దంత వైద్య కళాశాల భీమవరం వారు పెరవలి మండలం లయన్స్ క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అమోఘమైన సేవలు అందిస్తున్నారని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. దంత వైద్య శిబిరాల నిర్వహణే కాకుండా పెరవలి మండల కేంద్రంలో ఇటీవలే వలే డెంటల్ హాస్పటల్‌ను స్థాపించి పెరవలి మండల ప్రజానీకానికి మరింత దగ్గరయ్యారని ఆయన అన్నారు. జనవరి 2 వ తేదీ శుక్రవారం విష్ణు దంత వైద్య కళాశాల సిబ్బంది డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఖండవల్లి లోని రవళి స్పిన్నర్స్ ఆవరణలో పెరవలి మండలం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ రాజకుమారి దంపతులను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెరవలి మండలం లయన్స్ క్లబ్ కు విష్ణువు దంత వైద్య కళాశాల వారు అందిస్తున్న సహకారానికి ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పెరవలి మండలం లయన్స్ క్లబ్ ద్వారా విష్ణు దంత వైద్య కళాశాలకు అందిస్తున్న సహకారానికి తమ కాలేజ్ యాజమాన్యం తరఫున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవళి స్పిన్నర్స్ డైరెక్టర్ రవళి, పెరవలి మండలం లయన్స్ క్లబ్ డైరెక్టర్ పెరవలి ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్, సెక్రెటరీ సలాది ఉదయభాస్కరరావు, ఎంపీటీసీ బొక్కే వెంకటేశ్వర్లు, క్లస్టర్ రామరాజు, విష్ణు దంత వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ప్రజా దర్బార్'



సామర్లకోట, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అచ్చంపేటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రజల నుండి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందిన అన్ని దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిశీలించి తగిన పరిష్కారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఆయన తనయుడు నిమ్మకాయల రంగనాగ్, తెలుగు రైతు అధ్యక్షులు శ్రీను బాబు, గౌరవాధ్యక్షులు కుమారస్వామి, నూనె రామారావు, సామర్లకోట మండల అధ్యక్షుడు శ్రీరాములు,పట్టణ అధ్యక్షులు బదుగు శ్రీకాంత్, తహసీల్దార్ చంద్రశేఖర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హిమ మహేశ్వరి, ఇతర ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకముల పంపిణీ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప అధ్యక్షతన వారి క్యాంప్ కార్యాలయము ఎదుట శుక్రవారం పట్టాదారు పాస్ పుస్తకముల పంపిణీ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమములో పెద్దాపురం అసెంబ్లీ నియోజక వర్గములోని సామర్లకోట మరియు పెద్దాపురం మండలములోని వివిధ గ్రామాల నుండి వచ్చిన కొంతమంది రైతులకు వారి వద్ద నున్న పాత పట్టాదారు పాస్ పుస్తకములు వెనక్కి తీసుకుని కొత్త పట్టాదారు పాస్ పుస్తకములు యిచ్చుట జరిగింది.

మిగిలిన వారందరికీ వారివారి గ్రామములలో ప్రజా ప్రతినిధుల సమక్షములో పట్టాదారు పాస్ పుస్తకముల పంపిణీ జరుగుతుందని, 09 వ తేదిలోగా ఈ పంపిణీ కార్యక్రమము ముగుస్తుందనియు గ్రామస్థాయిలో సమావేశములు కూడా జరుగునని, ఏమైనా సమస్యలు ఉంటే సదరు సమావేశములలో పాల్గొనే రెవెన్యూ అధికారుల (తహశీల్ధారు) వారి దృష్టికి తేవలసినదిగాను, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు, ఫోటో, అడ్రస్సు మార్పులు అవసరమైతే గ్రామ సచివాలయములో దరఖాస్తులు యిచ్చి సరి చేయించుకొనవలసినదిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట తహశీల్ధారు కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, పెద్దాపురం తహశీల్ధారు చోడిశెట్టి వెంకటలక్ష్మి, పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి ఈ కార్యక్రమములో వివిధ గ్రామాల నాయకులు మరియు మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనినారు.

# ప్రకృతి వ్యవసాయ విస్తరణలో డ్రోన్ సాంకేతిక వినియోగం



**పెరవలి, మేజర్ న్యూస్ :** సాంకేతిక విధానంలో డ్రోన్ సహాయంతో రబి వరి పంటలపై ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో వేప గింజల ఇంగువ, చేప ద్రావణం, పిచికారి కార్యక్రమం చేపట్టడం జరిగింది. జనవరి 2 వ తేదీ శుక్రవారం పెరవలి మండలంలో కాపవరం, పెరవలి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ వరి పంటలపై 10ఎకరాలకు కషాయాలు పిచికారి చేయించడం కొరకు ప్రణాళిక పద్ధతిగా ముందుకు వెళుతున్నామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ఎమ్టి ఉమామహేశ్వరరావు తెలిపారు. వరి పంటలపై పురుగులు తెగులు నియంత్రణ కొరకు వ్యాప గింజల ఇంగువ కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించినట్లు జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. మొదటి విడతగా మండలంలో 3500 ఎకరాలలో ఈవిదంగా పిచికారీ చేసేవిదంగా ప్రణాళిక చేసినట్లు తెలిపారు. డ్రోన్స్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దీప్తి మాట్లాడుతూ వరి పంటలపై కాండం తొలిచేపురుగు రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వరి పంటలో వచ్చు తెగిళ్ళను నివారించడంలో వేప గింజల కషాయం, చేపల బెల్లం ద్రావణం బ్రహ్మాస్త్రము, వావిలాకు కషాయాలను జీవామృతంతో కలిపి పంటలపై పిచికారి చేయడం వల్ల ఆశించిన దానికంటే అధిక దిగుబడిని పొందవచ్చని గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నల్ల కాశి తెలియజేశారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ కొరకు డ్రోన్ సహాయంతో కషాయాలను రైతుల్లోనికి నేరుగా తీసుకువెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇ - గవర్నెన్స్‌పై శిక్షణా కార్యక్రమం

– పాల్గొన్న ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ




**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** ఎ.పి.ఎస్.ఐ.ఆర్.డి. వారి ఆధ్వర్యంలో డి.పి.ఆర్.సి. సూచనల మేరకు పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న డివిజన్ స్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఇ-గవర్నెన్స్‌పై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తెలుపుతూ గ్రేడ్ 1, 2, 5 వరకు ఇ-గవర్నెన్స్, పి.ఎఫ్.ఎం.ఎస్., ఇ-ఆఫీస్, పి.జె.ఆర్.ఎస్.లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఓటిలు యు.భార్గవ్, సురేష్, జ్యోతి, కె.వెంకటేష్‌లు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్ర మంలో డిప్యూటి ఎంపిడిఓ (పి.ఆర్.)లు,డిప్యూటి ఎంపిడిఓలు (జి.ఎస్.డబ్ల్యూ.ఎస్), ఏఓలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మొదటి రోజు పెద్దాపురం, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, శంఖవరం మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఎంపీపీ కార్చెర్లను కలిసిన ఎస్టియు టీచర్స్ యూనియన్ ప్రతినిధులు




**పెరవలి, మేజర్ న్యూస్ :** రాష్ట్రోపాధ్యాయ టీచర్స్ సంఘం పెరవలి యూనియన్ సభ్యులు డిసెంబర్ 2 వ తేదీ శుక్రవారం పెరవలి మండల ఎంపీపీ కార్చెర్ల సీతారామ ప్రసాద్‌ను, ఎంఈఓ బొబ్బిలి బాలసుబ్రమణ్య స్వరూప్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్టియు డైరీ క్యాలెండరు, సియల్ బుక్స్ ఆవిష్కరణ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెరవలి ఎస్టియు అధ్యక్షులు నల్లాకుల దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కె వెంకటేశ్వర రావు, ఆర్థిక కార్యదర్శి డివివిఎస్ ప్రసాద్ మరియు ఎస్టియు కార్యకర్తలు, ప్రకాష్, సిహెచ్ శ్రీనివాస్, శాంతారావు, శ్రీనివాస కుమార్, రహీమ్ పాల్గొన్నారు.

## వేటమామిడిలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** అడ్డతీగల మండలంలోని బంద కొండ గ్రామానికి సంబంధించిన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు శుక్రవారం వేటమామిడి గ్రామ సచివాలయంలో తాసిల్దార్ దొరకయ్య ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి పాల్గొన్నారు. అడ్డతీగల తాసిల్దార్ దొరకయ్య 15 మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. స్వప్న కుమారి మాట్లాడుతూ రెవెన్యూ సేవలో ఎలాంటి లోపాలు లేకుండా, చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాల్లో లబ్ధిదారుల ఫోటోలు బదులు ప్రభుత్వ పెద్దల ఫోటోలు ఉండేవని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ సేవలు ఎలాంటి అలసత్వం లేకుండా చేస్తున్నట్టు బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో మంజూరు చేయడం జరుగు తుందని, కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవకతవకలకు అవకాశం ఉండదని, ప్రభుత్వానికి సంబంధించి ప్రతి విషయము ప్రజల మధ్య పరిష్కారానికి అడుగులు వేస్తోందని, ఇదే కూటమి ప్రభుత్వ గొప్పతనం అని స్వప్న కుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీ పోరాటాల ఫలితమే 'పోలవరం' జిల్లా

**– రంప జిల్లాగా మార్చాలని నాయకులు డిమాండ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం కేంద్రంగా నూతన ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ నిర్విరామంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు, బందులు, ధర్నాలు, నిరసనలు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఏఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంగల శ్రీనివాసు పేర్కొన్నారు. పోలవరం జిల్లా ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నూతన జిల్లా ఏర్పాటు చేసినందుకు ఆదివాసీ సమాజం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. రంపచోడవరంలో "రంప" అనే చారిత్రక చరిత్ర పుటల్లో ఉందని, దానికి ముఖ్య కారణం మొదటి తరం మన్యం వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమన్న దొర అని ఆయన వలనే మొదటి "రంప పితూరి" 1839–1848 మధ్య కాలంలో జరిగిందని తెలిపారు. రెండో సారి అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో 1922–1924 కాలంలో మన్యం వీరులు గంటందొర, మల్లుదొర, అగ్గిదొర మొదలైన వారితో కలసి పోరాటాలు చేసిన ఘనత "రంప" కు ఉందని, కాబట్టి ఇవి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, కాబట్టి ఇంతటి ఘన చరిత్ర కలిగిన "రంప" ను విస్మరించి పోలవరం జిల్లా పేరు పెట్టడం 12 మండలాల ఆదివాసీలందరికీ నిరాశను మిగిల్చిందని, కాబట్టి పోలవరం జిల్లా పేరుకు బదులుగా రంప మరియు మొదటి తరం ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు పేరు మీద "రంప కారం తమ్మన్న దొర" జిల్లాగా పేరు మార్చాలని ఆదివాసి జేఏసీ డిమాండ్ చేస్తుంది.పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గ 5వ షెడ్యూల్డ్ ప్రాంతం లేకపోవడం విడ్డూరంగా ఉందని, పోలవరం జిల్లాలో కోట రామచంద్రపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతాలు జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలను పోలవరం జిల్లాలో కలపాలని ఆదివాసి జేఏసీ డిమాండ్ చేసింది. 12 ఆదివాసి మండలాలతో ఏర్పడిన పోలవరం జిల్లాలో రాజ్యాంగంలో కల్పించిన ఆదివాసి హక్కులు చట్టాలు 1917, 1/59, 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేసారు. కొత్త జిల్లాలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి చూపించాలన్నారు. అన్ని శాఖలలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే గుర్తించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలన్నారు. రంపచోడవరం కేంద్రంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించి ఆదివాసీలు ప్రాణాలు కాపాడాలన్నారు. రంపచోడవరంలో ఆదివాసీ స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేసి సివిల్స్, గ్రూప్స్ వివిధ పోటీ పరీక్షలకు నిరంతరం శిక్షణ ఇచ్చే అనుభవం ఉన్న మంచి ఫ్యాకల్టీని నియమించాలన్నారు. ఎన్నికల సమయంలో అరకు భారీ బహిరంగ సభలో, అలాగే పాడేరులో ఆదివాసీ దినోత్సవం రోజు, పోలవరం నియోజక వర్గంలో జివో.3 బదులు వేరే జివో తీసుకొచ్చి ఆదివాసులకు వంద శాతం ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇన్ని రోజులు అవుతున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, కాబట్టి వెంటనే ఆదివాసీలకు ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసి ఆదివాసీ ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ ఆదివాసీలకు మాత్రమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది.

ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ నాయకులు కంగల శ్రీనివాసు, పోడియం పండుదొర, మడకం ప్రసాద్ దొర, చవలం సుభకృష్ణ, పండ పవన్, దూసరి కనకదుర్గ, తెల్లం శేఖర్, కారం రామన్నదొర, సారపు నాగేశ్వరావు, కుంజం వెంకన్న, కత్తుల రమణా రెడ్డి, పల్లాల రాజకుమార్ రెడ్డి, కర్రి సన్యాసి రెడ్డి, సారపు శ్రీనివాసుదొర, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కానూరు నటుపల్లికోట సిసి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు నడిపల్లికోట గ్రామాల మధ్య గల రోడ్డు స్థానిక ఎమ్మెల్యే మరియు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మరియు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుల చొరవతో కోటి యాభై లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్డు మంజూరైన సంగతి తెలిసిందే. జనవరి 2 వ తేదీ శుక్రవారం సదరు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు నాయకుల ఆదేశాలతో కానూరు గ్రామ సర్పంచ్ బావన మధు పూర్ణ చందు, నడిపల్లి గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు, కానూరు సొసైటీ అధ్యక్షులు వాకలపూడి వీర్రాజు, కానూరు వన్ ఎంపీటీసీ కోలా పార్వతి సీతయ్య నాయుడు, కానూరు టిడిపి అధ్యక్షులు ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, కానూరు జనసేన అధ్యక్షులు రంకిరెడ్డి ప్రసాద్, జనసేన జిల్లా సెక్రెటరీ మూర్తి, నడిపల్లి తెలుగుదేశం అధ్యక్షులు బూరుగుపల్లి రాము, తెలుగుదేశం క్లస్టర్ అధ్యక్షులు చిట్టూరి వెంకటనారాయణ కొబ్బరికాయలు కొట్టి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానూరు, నడిపల్లి, తెలుగుదేశం, జనసేన కార్యకర్తల పాల్గొన్నారు.

# 40వ జాతీయ టైక్వాండో పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి



కాకినాడ, మేజర్ న్యూస్ : ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బిఎఫ్ఎస్ఐ ప్రథమ సంవత్సరం చదువుతున్న గొర్లె నాగ తనుశ్రీ జాతీయ టైక్వాండో పోటీలలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. 40వ జాతీయ టైక్వాండో ఐటిఎఫ్ ఛాంపియన్ షిప్–2025 పోటీలు గుజరాత్ రాష్ట్రంలో గల గాంధీ నగర్ లో ప్రేక్షధ్యాన్ అకాడమీ ఆడిటోరియంలో డిసెంబర్ 28 నుండి 30 వరకు జరిగాయి. 18 నుండి 34 ఏజ్ 60 కేజీల పైబడిన కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ టీమ్ తరపున ఆడిన గొర్లె నాగ తనుశ్రీ సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయిలో తన ప్రతిభను కనబరిచింది. సిల్వర్ మెడల్ సాధించిన నాగ తనుశ్రీని అభినందించి డాక్టర్ నాయుడు మాట్లాడుతూ క్రీడారంగంలో మహిళలు రాణించడం విశేషమని, అంతర్జాతీయ స్థాయిలో భారత ఖ్యాతి నిలబెట్టాలని అన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి ఉపయోగ పడతాయని ఆదిత్య డిగ్రీ కళాశాలలలో విద్యతో పాటు సాంస్కృతిక క్రీడా అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ద్వితీయ స్థానంలో నిలచి పతకం సాధించిన నాగ తనుశ్రీని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు,వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు కె కిరణ్ అభినందించారు.

# ఈ నెల 9 నుండి 11 వరకు పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు

**– జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సందర్భంగా పిఠాపురంలో జనవరి 9 నుంచి 11 వరకు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శుక్రవారం పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల నిర్వహణపై జేసీ అపూర్వ భరత్, డీఆర్ఓ వెంకటరావు సమన్వయ శాఖల శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... ఈనెల 9, 10, 11 తేదీలలో పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు అవసం మైన ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సంబరాల్లో సంక్రాంతి శోభ, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టి పడేలా, జిల్లా పర్యాటకా భివృద్ధికి దోహదం చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. సంక్రాంతి సంబరాల నిర్వహణకు పిఠాపురం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పాఠశాల ఆవరణలో అనుకూలతలను అధికారులతో కలిసి పరిశీలించారు. సభా వేదిక, సాంస్కృతిక ప్రదర్శనల వేదికలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణ రావు, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, పాడా పీడీ ఎ.శ్రీనివా సరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్,వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఫోటో ఎక్కడ...?

**– అధికారులను ప్రశ్నించిన జనసైనికులు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఫోటో ఎక్కడ...? అంటూ జన సైనికులు అధికారులను నిలదీసిన ఘటన శుక్రవారం పిఠాపురంలో చోటుచేసుకుంది. స్థానిక రథాలపేట అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధిత రెవెన్యూ అధికారులు స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, ఎస్వీఎస్ఎన్ వర్మ ఫోటోలు మాత్రమే వేశారని, ప్రస్తుత ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో ఎందుకు వేయలేదని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి మరియు మరికొందరు జన సైనికులు ఎమ్మార్వో గోపాలకృష్ణను ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే పవన్ కళ్యాణ్ ఫోటో వేయలేదని వారు ఆరోపించారు.

## హెల్మెట్, రేస్ డ్రైవింగ్‌పై సామర్లకోట ఎస్సై విస్తృత తనిఖీలు



**సామర్లకోట, మేజర్ న్యూస్:** హెల్మెట్ రేస్ డ్రైవింగ్ లైసెన్స్ లపై సామర్లకోట సిబిఎం సెంటర్లో సామర్లకోట ఎస్సై ఎం.రాజా విస్తృత తనిఖీలు చేపట్టారు.శుక్రవారం సాయం త్రం చేపట్టిన తనిఖీల్లో హెల్మె ట్ల లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, లైసెన్సులు లేకుండా వాహనాలను నడిపే యువతను, రేస్ డ్రైవింగ్ చేసే యువతను నిలువరించారు. ఈ సందర్భంగా అక్కడక్కడ వాహనదారులకు పోలీస్ యాప్ ద్వారా అపరాధ రుసుములను విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు సూచనలతో హెల్మెట్లు లేని డ్రైవింగ్, లైసెన్సులో లేకుండా వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు ఈ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో మౌలిక సదుపాయాలకు సంబంధించి అవసరాలకు నివేదికలు సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో మండల విద్యాశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన ఉపాధ్యాయులు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాల ప్రిన్సిపాల్స్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో భవనాలు మరమ్మతులకు సంబంధించి నివేదికలు సమర్పించాలని, ప్రహరీ గోడలకు సంబంధించి మరమ్మత్తుల నివేదికలు, కొత్త ప్రహరీ గోడలు ఏర్పాటు చేయుటకు, ఆర్వో ప్లాట్లు మరమ్మత్తులు చేయుటకు, బాత్రూములు మరమ్మతులు, సిక్ రూములు మరమ్మతులు చేయుటకు అదేవిధంగా కొత్తవి ఏర్పాటు చేయుటకు, రన్నింగ్ వాటర్ మరమ్మత్తులు కొత్తవి ఏర్పాటు చేయుటకు నివేదికలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐడీ ఏర్పాటు చేయుటకు ఆధార్ కార్డులలో వయసు, పేర్లు తప్పులు, డేట్ అఫ్ బర్త్ తప్పులు, మేలు, ఫిమేల్ తప్పులు, గ్రామాలు, మండలాలు వారీగా తప్పులు సరి చేయించాలన్నారు. ఎక్కడైనా ఎన్రోల్మెంటు, ఆధార్ కార్డులలో తప్పులకు సంబంధించిన వారు ఎక్కువమంది ఉంటే మొబైల్ ఆధార్ కేంద్రాలను పంపించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పరిధిలో క్విజ్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు, పెయింటింగ్ పోటీలు, గ్రూప్ డాన్సులు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మండల స్థాయిలో నిర్వహించి, ఆతర్వాత ఐటీడీఏ పరిధిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

జనవరి 26 తేదీన గణతంత్ర దినోత్సవానికి ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులకు రంపచోడవరం తీసుకురావాలన్నారు. ఆరో తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు చాలా పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా ఎట్టి పరిస్థితుల్లో మాస్ కపియింగ్‌కు అవకాశం లేకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఏ విధంగా ఉంటాయి, పేపర్ ఏ విధంగా రాయాలి అనే అంశంపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలన్నారు. పరీక్షలు జరిగేవరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలన్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లకు దరఖాస్తులు చేసిన వారికి సంబంధిత అధికారులతో సంప్రదించాలన్నారు.

ఈ సమావేశంలో ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటిఓ బి.చిన్ని బాబు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, జె.శంభుడు, సూపరింటెండెంట్ బి.కిషోర్, గిరిజన సంక్షేమ శాఖ ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

# బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి నాలుగో స్థానంలో నిలిచినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. యూనివర్శిటీ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్శిటీ టీమ్ ఎంపిక ట్రైల్స్ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో జరిగాయి. ఈ పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాలలో బి ఎఫ్ ఎస్ ఐ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.ఎస్.కె.చైతన్య రెడ్డి, ఎస్.ఎస్.ఎస్.ఎస్.శ్రీనివాస్ రెడ్డినిజి.దుర్గా ధనుష్, సిహెచ్.సాయి శంకర్, ఎస్.కె.అహ్మద్ రజా, ఎన్.జి.ఎన్.ఉమా మహేశ్వర రావు విద్యార్థుల బృందం పాల్గొని నాలుగవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి డాక్టర్ నాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడతాయని ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతో పాటు సాంస్కృతిక క్రీడా అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. నాలుగో స్థానంలో నిలిచి పతకం సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు కె.కిరణ్ అభినందించారు.

# సరళ వందనం సేవలు మరువలేము




**– పదవీ విరమణ సభలో అధికారుల ప్రశంసలు**

**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన సత్తెనపల్లి సరళ వందనం పదవీ విరమణ సన్మాన సభ స్థానిక పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ మరియు ఎక్స్అఫిషియో జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ రెవిన్యూ విభాగంలో సరళ వందనం చేసిన సేవలు కొనియాడారు. సుమారు 36 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేశారని అన్నారు. రెండున్నర సంవత్సరాలు ఇక్కడ స్పెషల్ కలెక్టర్‌గా సమర్థవంతంగా పనిచేయడం వల్ల సుమారు 700 కోట్లు భూసేకరణకు సంబంధించిన బిల్లులు రైతులకు చెల్లించామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు మరియు నిర్వాసితులకు అవసరమైన భూసేకరణ విషయంలో సరళ వందనం చేసిన కృషిని కొని యాడారు. పదవీ విరమణ అనేది కేవలం వృత్తి మాత్రమే అని జీవితానికి కాదని శేషజీవితం సంతోషంగా ఆరోగ్యంగా గడపాలని పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళ వందనం చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఎ టు కలెక్టర్ రాజేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మరియు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అధికారులకు, సిబ్బందికి సరళ వందనం ధన్యవాదములు తెలిపారు.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో ఆసాదులు, వేదపారాయణ దారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పులిహోర ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి క్యాలండర్ ఆవిష్కరణ

**– పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రంగనాగ్**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో 2026 క్యాలండర్‌ను దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన క్యాలండర్‌ను శుక్రవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వారి తనయుడు మరియు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్‌లు ఎమ్మెల్యే స్వగృహం నందు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కాకినాడ డిసిసిబి క్యాంప్ కార్యాలయం నందు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఆసాదులు రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి తెలుపుతూ శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ప్రప్రథమంగా 2026 క్యాలెండర్‌కు తయారుచేయుటకు సహాయ సహకారాలు అందించిన పెద్దాపురం వాస్తవ్యులు కాపుగంటి స్వరూప్, పాశిల శివకుమార్‌లకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి,అమ్మవారి ప్రసాదం అందజేసినట్లు పేర్కొన్నారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ప్రవాచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సతీ సమేతంగా శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త చైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వేంద్ర త్రినాథరావు, దామోర కృష్ణారావు, ఆలయ అధికారి గణపతి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వేంద్ర త్రినాథరావు శ్రీ స్వామివారి శేష వస్త్రం, శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.